

శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని సన్నిధిలో ఏపీ జస్టిస్



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండల పరిధి, అప్పలాయిగుంట, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ జస్టిస్ తుహిన్ కుమార్ కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి, శ్రీవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, తిరుపతి ప్రోటోకాల్ కోటేశ్వరరావు, ధనుంజయ నాయుడ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు

ఎస్టీలకు ప్రత్యేక జాబ్ మేళా : కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సమాజంలో ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళేది విద్య ఒక్కటేఅని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక గిరిజన సంక్షేమ భవన్‌లో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గిరిజనలకు ప్రత్యేకమైన కట్టుబాట్లు, ఆచారాలు, అలవాట్లు ఉంటాయని, ఇక్కడున్నవారందరికీ ఒక ప్రత్యేకత ఉంటుందని మీరు చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించినా మీతో పాటు మీ సంప్రదాయాలను, కట్టుబాట్లను ముందుకు తీసుకెళ్ళాలన్నారు. నృత్యాలలో కూడా లంబాడా, బంజారా, వివిధ రకాల నృత్యాలు ఉన్నాయని, వేషధారణ కొన్ని చోట్ల ఇంకా ఇప్పటికీ ఆచరిస్తున్నారని తెలిపారు. గిరిజనులు తినే ఆహారం చాలా పౌష్టికమైనదని, ఈ నాటికి చాలామంది డాక్టర్లు దానిని గుర్తించి ఇప్పుడు సుగర్, బీపీ, ఇతర ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చినా గిరిజనులు సహసిద్ధంగా, ప్రకృతిపరంగా పండేటటువంటి చిరుధాన్యాలను సూచిస్తారన్నారు. ఈ రోజు చాలామంది నేతలు సమస్యలు నా దృష్టికి తీసుకొచ్చారని ముందుగా ఈ భవనం నుండే మొదలు పెట్టడం జరుగుతుందని, మరమ్మత్తులు, నిర్మాణం కొరకు ప్రభుత్వం నుండి ఈ నెలాఖరులోపు ఇంకో 20 లక్షల రూపాయలు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. తుడా చైర్మన్, కార్పొరేషన్ వారితో మాట్లాడి అదనంగా 10 లక్షలు మంజూరు కోరడం జరుగుతుందన్నారు. జిల్లాలో కొన్ని మండలాల్లో ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు ఇచ్చారని ఇంకా కొన్ని మండలాల్లో ఇవ్వాల్సిఉందని, గతంలో కూడా నాకు అనుభవం ఉందని గతం పాడేరులో 76 వేల ఎకరాలు ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు 52 వేల మంది గిరిజన కుటుంబాలకు ఇవ్వడం జరిగిందన్నారు. జీ 6 కి సంబంధించి కొన్ని సమస్యలు చెప్పారని, ఇప్పటికే రుయా హాస్పిటల్ ఔట్ లెట్ పెట్టడం జరిగిందని, ఇంకోటి పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రుల ఆధ్వర్యంలో షైనింగ్ స్టార్స్ అనే కార్యక్రమం మొదలుపెట్టడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో ప్రతి మండలం నుండి అన్ని వర్గాలకు చెందిన వారిని గుర్తించి ఈ అవార్డ్స్‌కి అందజేయడం జరుగుతుందన్నారు. గిరిజన పిల్లలు ఎక్కువగా 10 చదివి ఐటీఐ చేస్తారని, ఇంటర్మీడియట్ దగ్గర ఆపేస్తుంటారని, తక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంచుకోబడుతున్నారని, చాలా తక్కువ మంది ప్రభుత్వ సంస్థలకు వెళ్తున్నారని, మన జిల్లాలో ఎన్నో పెద్ద పెద్ద పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. ఎస్టీల కొరకు ఒక ప్రత్యేక జాబ్ మేళాను ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటామన్నారు. హథీరాం బాబాజీ మఠం భూములు ఆక్రమణకు గురయ్యాయని వాటి పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటిని తొలగించి ఆక్రమణకు గురి అవ్వకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆదివాసులు ఉన్న ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించి, హౌసింగ్‌లో



ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, డాక్టర్ పవుపులేటి హరి ప్రసాద్

ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 1.42లక్షల మంది యానాదులు, 11 వేల మంది సుగాలీలు, 11 వేల మంది ఎరుకుల కులస్తులు, 6 వేల మంది నక్కల కులస్తులు కలిపి సుమారు 1.70 లక్షల మంది ఉన్నారని తెలిపారు. 16 రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, 7 హాస్టళ్లు, గిరిజన పాఠశాలలు కూడా ఉన్నాయని, వీరందరికీ 1150 నుండి1600 రూపాయలు కాస్మెటిక్ ఛార్జ్ రూపాన అందిస్తుందన్నారు. చాలామందిలో నైపుణ్యం పెంచాలని జర్మనీ పంపించే చర్యలు తీసుకుంటున్నారు. పి4లో భాగంగా నేను కూడా 5 కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందని, జిల్లాలో 82 వేల కుటుంబాలను గుర్తించి, వారిలో 42 వేల కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఏపి హస్తకళా కార్పొరేషన్ అభివృద్ధి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ ఆదివాసులు అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. కొండ ప్రాంతంలో ఉన్న ప్రతి ఆదివాసీ కుటుంబానికి బెడ్ షీట్స్ పంపిణీ చేశామన్నారు. 10, ఇంటర్ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా పారితోషకం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హస్త కళా నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నంసింహ యాదవ్, గిరిజన సంక్షేమ శాఖ అధి కారి రాజా సోము, గిరిజన సంఘం జనరల్ సెక్రెటరీ శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ కృష్ణ, బంజార సంఘం ప్రెసిడెంట్, తలుపుల మల్లికార్జున, యానాది సంఘం ప్రెసిడెంట్, గిరిజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ సుమన్, వసంతమ్మ యానాది మహిళా సెక్రటరీ, రిటైర్డ్ డీఎఫ్ఓ భాస్కర్, టిటిడి ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ గిరిజన నాయకులు, విద్యార్థు లు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి టిడిపిలో లీడర్ కరువు..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి నియోజకవర్గం టిడిపిలో లీడర్ కరువయ్యారు.. కూటమి పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ సీట్లు జనసేనకు కేటాయించారు.. డజన్లకొద్దీ ఎన్నికల ముందు సీటు కావాలంటూ పోటీలు పడ్డారు.. అయితే కూటమి అధికారంలోకి రావడంతో టిడిపిలో అసంతృప్తి, అసహనం నెలకొంది. తిరుపతి టిడిపి ఇన్చార్జిని అధిష్టానం ప్రకటించకపోవడంతో పార్టీలో గందరగోళం నెలకొంది.



టిడిపి ఆవిర్భావం నుంచి తిరుపతి నియోజకవర్గంలో ఆ పార్టీ పోటీ చేస్తూనే వచ్చింది..1983 నుంచి ఎన్టీ రామారావు నుంచి మాజీ ఎమ్మెల్యే సుగుణము వరకు ఆరుగురు ఎమ్మెల్యేలుగా ఉన్నారు.. ప్రతి ఎన్నికల్లోనూ శ్రీవారి సన్నిధి నుంచి శంఖారావం పూరించి ఎన్నికల్లో కి వెళ్ళడం టిడిపి ఆనవాయితీ.. అయితే 2024 ఎన్నికల్లో టిడిపి భిన్నంగా వ్యవహరించింది.. బిజెపి టిడిపి జనసేన పొత్తులో భాగంగా ఈసారి సీటును జనసేనకు కేటాయించింది.. జనసేనకి కూడా లీడర్ కరువు కావడంతో చిత్తూరు నుంచి వలస తెచ్చుకుంది.. 2019 ఎన్నికల్లో చిత్తూరు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే గెలిచిన ఆరని శ్రీనివాసులను తిరుపతిలో జనసేన అభ్యర్థిగా పోటీ పెట్టింది.. అభ్యర్థి పేరు ప్రకటించగానే టిడిపి, జనసేన, బిజెపిల మధ్య మనస్పార్థాలు వచ్చాయి.. అభ్యర్థి బహిరంగంగానే వ్యతిరేకించారు.. ఎట్టకేలకు అధినేతలు సర్ది చెప్పడంతో ఎన్నికల్లో పనిచేసి కూటమి అభ్యర్థిని గెలుచుకున్నారు.. 2024 ఎన్నికల్లో టిడిపి నుంచి ఆశావాలు ఆరడజన్ మంది ఉన్నారు. వారిలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం ఇన్చార్జి నరసింహ యాదవ్, నేతలు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, జేబీ శ్రీనివాస్, ఊక విజయ్ కుమార్‌లు తీవ్రంగా ప్రయత్నించి భంగపడ్డారు. అప్పట్లో ఉత్సాహం చూపిన ఈ లీడర్లు పార్టీ అధికారం రాగానే గమ్మునుండి వెళ్లిపోయారు. క్యాడర్ను సంతృప్తి పరచలేక పోటీపడిన లీడర్లు అధినేత చంద్రబాబు నాయుడుపై అసహనం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి తిరుపతి నియోజకవర్గం ఇన్చార్జి నర్సింగ్ యాదవ్ లకు మాత్రం రాష్ట్ర నామినేట్ పదవులు ఇచ్చినప్పటికీ వారు సంతృప్తిగా లేరు.. వలసవాదులకు పదవులు, టికెట్లు ఇస్తే భవిష్యత్తులో తిరుపతి టిడిపి క్యాడర్ ను కాపాడుకునేది ఎట్లా అంటూ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ బహిరంగంగానే తన వ్యతిరేకతను చాటుకున్నారు.. ప్రస్తుతం తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి పదవి ఖాళీగా ఉంది. సరైన లీడర్ దొరకపోవడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు మంచి వ్యక్తిని అన్వేషిస్తున్నారు. ఇటీవల తుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దివాకర్ రెడ్డి చురుగ్గా పార్టీ కార్యక్రమంలో పాల్గొనడం, జన సమీకరణ, ఆర్థికంగా పరిపుష్టిగా ఉండడంతో భవిష్యత్తు లీడర్‌గా ఎదిగేందుకు అవకాశం కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు భావన. తిరుపతి, చంద్రగిరి ఏ నియోజకవర్గంలోనూ తనను ఎవరు పిలిచినా హాజరై దివాకర్ రెడ్డి కార్యకర్తలు ప్రజల వద్ద మార్కులు కొట్టేస్తున్నారు. చంద్రగిరి తిరుపతి నియోజకవర్గాల్లో డాలర్ దివాకర్ రెడ్డి పట్టు బిగించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ కూడా డాలర్ దివాకర్ రెడ్డి రాజకీయ ఎదుగుదలకు ప్రత్యక్షంగా సహకరిస్తున్నట్లు పార్టీ వర్గాలు కూడా చెబుతున్నాయి. ఏదేమైనా ప్రస్తుతం తిరుపతి నియోజకవర్గంలో టిడిపికి లీడర్ కరువు అయ్యారని చెప్పుకోవచ్చు.

పల్మనాలజీకి ప్రత్యేక విభాగం అవసరం



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సత్కరిస్తున్న అప్సకాన్ 2025 ప్రతినిధులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరం రోజురోజుకు విస్తరిస్తుందని జనాభాకు అనుగుణంగా, పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని రాయలసీమకే తలమానికమైన తిరుపతి రుయా ఆసుపత్రిలో పల్మనాలజీ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రజా ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. అసోసియేషన్ ఆఫ్ పల్మనాలజిస్ట్ ఆఫ్ సీమాంధ్ర అప్సకాన్ 2025 వార్షిక సమావేశాన్ని తిరుపతి కరకంబాడి మార్గంలోని ఆశా కన్వెన్షన్ సెంటర్లో శనివారం రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, శాసనమండలి సభ్యులు సిపాయి సుబ్రమణ్యం, టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరి ప్రసాద్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర సమయంలో పల్మనాలజిస్టుల పాత్ర చాలా కీలకంగా వ్యవహరించడంతో అనేకమంది తమ ప్రాణాలను కాపాడుకోగలిగారన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో ఇటువంటి కార్యక్రమం జరగడం, కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న పల్మనాలజిస్టులు, రిసర్చ్ డాక్టర్లు హాజరై అధునాతన వైద్య సేవలపై చర్చించడం శుభ పరిణామన్నారు. భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో టీబి తగ్గుముఖం పట్టిందన్నారు. పెరుగుతున్న కాలుష్యం దృష్ట్యా పల్మనాలజీకి ప్రత్యేక విభాగాన్ని అధునాతన వసతులతో ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, అప్సకాన్ 2025 చైర్మన్ ప్రేమానంద్, కార్యదర్శి సుబ్బారావు ఇతర వైద్య నిపుణులు సూచన మేరకు రుయా ఆస్పత్రి పరిధిలో సెంటర్ ఫర్ ఎక్స్ లెన్స్ ఆఫ్ పల్మనాలజీ ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌ల దృష్టికి తీసుకెళ్లి తగిన సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. రెస్పిరేటరీ మెడిసిన్ అనేది నేడు కీలకమైనదని, పల్మనాలజీ విభాగానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ముఖ్యమని శాసనమండల సభ్యులు సిపాయి సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్, సైంటిఫిక్ కమిటీ సభ్యురాలు డాక్టర్ నీతిచంద్రిక, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, రుయా సూపరిండెంట్ డాక్టర్ రాధా, ఎస్వీ మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రభు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు, డిఎం అండ్ ఎచ్ ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పాత మీటర్లే ముద్దు స్మార్ట్ మీటర్లు వద్దు అంటూ సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి పిలుపు నిచ్చారు. సిపిఐ కార్యాలయంలో సిపిఐ తిరుపతి నగర కార్యదర్శి జెల్ల విశ్వనాథ్, సిపిఎం నగర కార్యదర్శి వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి శనివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాత మీటర్లు ముద్దు స్మార్ట్ మీటర్లు వద్దు, అదానికి రాష్ట్ర ప్రజానీకాన్ని తాకట్టు పెట్టవద్దని కోరారు. ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులకొట్టండని సూచించారని, కానీ అధికారం వచ్చాక మాట మార్చారని ఆరోపించారు. గత పాలకులు లోపాయకారి ఒప్పందాలు రద్దుచేస్తామని హామీ ఇచ్చి నేడు విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రజలపై భారం మోపడమేమిటని ప్రశ్నించారు. 11వ తేదీన వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఐక్యవేదిక పిలుపును అమలు చేయడం జరుగుతుందని అందులో భాగంగా ఎస్.పి.డి.సి.ఎల్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ నారాయణ పాల్గొంటున్నారని, పెద్ద ఎత్తున ప్రజానీకం ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పెంచలయ్య, రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్ డి రవి, కేవై రాజా, శ్రీరాములు, శివ, గోవిందస్వామి, పద్మనాభ రెడ్డి, మహేంద్ర, శ్రీనివాసులు, పురుషోత్తం, రాజశేఖర్, సిపిఎం నాయకులు మురళి, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మస్థల ఆలయం ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలి

■ సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



ప్రజాశక్తి - తిరుమల: ఓ వివాహ వేడుకకు తిరుమలకు వెళ్లిన సిపిఐ నారాయణ తిరుమలలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తిరుమలలోని శ్రీవారి దర్శనం తాను ఇంకా చేసుకోలేదని పేర్కొన్న నారాయణ తిరుమల శ్రీవారి ఆలయానికి సంబంధించి టిటిడి ట్రస్ట్ ఉందని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు చేస్తుందని వ్యాఖ్యలు చేశారు. ఇక ఇదే సమయంలో కర్ణాటకలోని ధర్మస్థళ ట్రస్ట్ ఒక కుటుంబం చేతిలో ఉందని వ్యాఖ్యలు చేశారు. 500 మందిపై లైంగిక దాడి చేసి హత్య చేసి పూడ్చి పెట్టారన్నారు. ధర్మస్థల ట్రస్ట్‌కు ఏడాదికి వంద కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని పేర్కొన్న నారాయణ ధర్మస్థళ దేవస్థానంలో జరిగిన దారుణాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయన్నారు. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి సిట్ వేసి దర్యాప్తు చేస్తుందని పేర్కొన్నారు. ధర్మస్థళ ట్రస్ట్‌ను వెంటనే ఎండోమెంట్ విభాగం స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు. ట్రస్టు చైర్మన్‌తో పాటు సభ్యులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అది దేవస్థానమా లేక స్మశాన వాటికనా అని ప్రశ్నించారు. ట్రస్ట్ చైర్మన్‌ను, సభ్యులను వెంటనే అరెస్టు చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. తవ్వేకొద్దీ పుర్రెలు, ఎముకలు బయట పడుతున్నాయన్నారు. గతంలో సిపిఎం నేత ఎంపీగా పోటీ చేయకూడదని ట్రస్టు సభ్యులు అడ్డుకున్నారని, అతను తెగించి పోటీ చేసినందుకు 15 ఏళ్ల ఆయన కుమార్తెను అత్యాచారం చేసి చంపేశారని నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.


'రాజ'కీయ డ్రామాలు

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : రాజకీయం అనే పదం వినగానే చాలామందికి పొలిటికల్ లీడర్స్, ఎలక్షన్స్, పార్టీలు, వాగ్దానాలు, వివాదాలు, గుర్తుకు వస్తాయి. కానీ అసలు రాజకీయం అంటే అర్థం వేరు. ప్రజల జీవితాన్ని ప్రభావితం చేసే విధానం రాజకీయం. ఒక మనిషి సంకల్పం వల్ల రాజ్యాన్నే రక్షించవచ్చు. కానీ అధికారం పట్ల మోజు పెరిగితే ప్రజలే అతని శాపంగా మారుతారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ పరిస్థితుల అలానే ఉన్నాయి. తిరుపతి జిల్లా పరిస్థితి దానికి ఏమాత్రం తీసుపోలేదు. గత మూడు రోజులుగా తిరుపతి కేంద్రంగా జరుగుతున్న రాజకీయ డ్రామాలే అందుకు నిదర్శనం.

తమకు బాకీ ఉన్నాడనే అక్కసుతో కొంతమంది ఫైనాన్సర్లు దళితుడుని చావబాదారు. పైగా ఆ వీడియోలను బాధితుడి తల్లిదండ్రులకు పంపించి బెదిరించిన ఘటన సోషల్ మీడియా ద్వారా జిల్లా అంత ప్రచారం అయింది. ఇంకేముంది అధికార, ప్రతిపక్ష పార్టీలు రంగంలోకి దిగాయి. నిందితులు ఎదుటి పార్టీ వారే అంటూ ఒకరిపై మరొకరు విమర్శలు గుప్పించుకోవటం ప్రారంభించారు. ఈ ఘటనపై ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు తప్ప, బాదితునికి న్యాయం జరిగేలా బూర్జువా రాజకీయ పార్టీలు ఏం మాత్రం శ్రద్ధ చూపకపోవడం శోచనీయం.

వాస్తవ కథలోకి వెళితే ఉమ్మడి చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పులిచెర్లకు చెందిన ఎన్.పవన్ తిరుపతిలో కాపురం ఉంటున్నారు. ఇతనికి రెండు వివాహాలు అయ్యాయి. భార్యలిద్దరికీ దూరంగా ఉంటున్నాడు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులను అనుచరులతో కలిసి తిరిగేవాడు. వైసిపికి చెందిన అనిల్ రెడ్డి తిరుపతి శ్రీనివాసం ఎదురుగా ఎస్‌విపి బైక్ రైడర్స్ అండ్ రెంటల్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఇతను వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధికి డ్రైవర్‌గా కూడా విధులు నిర్వహించేవాడు. అనిల్ రెడ్డి వద్ద పవన్ నెల క్రితం ద్విచక్రవాహనాన్ని అద్దెకి తీసుకున్నాడు. ఆ వాహనాన్ని ఇతరులకు విక్రయించాడు. అప్పట్నుంచి అనిల్ రెడ్డికి కనిపించకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. పవన్ జనసేన పార్టీకి చెందిన దినేష్ రెడ్డి వద్ద కూడా ఇదేవిధంగా ద్విచక్ర వాహనన్ని గతంలోఅద్దెకి తీసుకొని ఇతరులకు విక్రయించేశాడు. ఇతను ఇదేవిధంగా ఇద్దరు ముగ్గురు ద్విచక్ర వాహన అద్దెదారుల వద్ద ఇలాగే వ్యవహరించడంతో ఫైనాన్సర్లు అతని కోసం గాలింపులు చేపట్టారు. నాలుగు రోజుల క్రితం ఎలాగోలా బాధితుడు పవన్‌ని అనిల్ రెడ్డి అతని సహచరులు పసిగట్టి, ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న తమ కార్యాలయం వద్దకు తీసుకెళ్లారు. తన వాహనానికి డబ్బులు చెల్లించాలని పవన్‌ను హెచ్చరించాడు. పవన్ అనిల్ రెడ్డి వద్ద ఉన్నాడని తెలుసుకున్న మరో ఫైనాన్స్ దినేష్ రెడ్డి, అనిల్ రెడ్డి కార్యాలయానికి చేరుకొని తమ బాకీ తీర్చాలంటూ పవన్‌పై పోలీసు లాటితో విరుచుకుపడ్డాడు. పవన్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి, పవన్‌ను కొడుతున్న వీడియోలు పంపి, తమ బాకీ చెల్లించకుండా పోతే, ఇతని కిడ్నీలు తీసేస్తామని బెదిరించారు. ఈ విషయం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో, జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అంతే ఇంకా బూర్జువా రాజకీయ పార్టీలు అసలు కథకు తెరలేపాయి.



వైసీపీ నాయకుడు అనిల్ రెడ్డి దళితుడుని బంధించి చితకబాదాడని కూటమి పార్టీల నాయకులు సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షంపై విమర్శలు గుప్పించారు. అధికార పక్షానికి ఏమాత్రం తీసుకోకుండా ప్రతిపక్ష స్థానిక నాయకులు పవన్ పై లాటితో దాడి చేసిన దినేష్ రెడ్డి అనే వ్యక్తి తమ పార్టీవాడు కాదని జనసేన పార్టీకి చెందిన వాడిని, తిరుపతి ఎమ్మెల్యే తో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగేవాడిని, అందుకు తగ్గ ఫోటోలు వీడియోలను సోషల్ మీడియా వేదిక ప్రచారం చేశారు. రాష్ట్ర హోం మంత్రి అనిత, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ దీనిపై స్పందించి ఇందుకు కారణమైన వైసీపీ నాయకుల్ని అరెస్టు చేయాలని ఆదేశించారు. స్పందించిన పోలీసులు వెంటనే అన్యల్ రెడ్డి పై కేసులు నమోదు, చేసి అరెస్టు చేశారు. ఆ సాయంత్రానికే బాధితుడు పవన్ నుంచి సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. తనను ఎవరు ఏమీ అనలేదని, తన అన్న వరసైన దినేష్ రెడ్డికి తను అప్పు ఉండడంతో గట్టిగా మందలించాడని, అన్నగా తనను కొట్టాడే తప్ప వేరే దుర్దేశం లేదని, అతను లేకపోతే 30 నుంచి 40 మంది తనపై దాడి చేసే వారిని, అనిల్ రెడ్డికి తనకు ఎలాంటి సంబంధం లేదని వీడియో ద్వారా ప్రచారం చేశారు. ఇలా అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు వారికి అందుబాటులో ఉన్న సోషల్ మీడియా ద్వారా ఒకరిపై ఒకరు దూషణలు చేసుకుంటూ ప్రచారాలు ముమ్మరం చేశారు. మరోవైపు వామపక్ష నాయకులు, దళిత బీసీ సంఘాల నాయకులు ఐక్యంగా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని బాధితుడిని వెంటనే ప్రజల ముందుకు తీసుకురావాలని, అధికార ప్రతిపక్ష పార్టీలు వాస్తవాలు ప్రజలకు తెలియపరచాలని సూచించారు. మరోవైపు అనిల్ రెడ్డిని పోలీసులు రిమాండుకు తరలిస్తున్న సమయంలో అతని భార్య పోలీస్ స్టేషన్ ఎదుట పోలీసుల కాళ్లపై పడి తన భర్త ఎలాంటి తప్పు చేయలేదని అతని వెంటనే విడుదల చేయాలని ప్రాధేయపడటం పలువురుని విస్మయానికి గురి చేసింది.

మరోపక్క బాధితుని తల్లిదండ్రులు తమ బిడ్డను చూపాలంటూ దళిత సంఘాలతో కలిసి పోరాటాలకు సిద్ధమయ్యారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు మీడియా ముందుకు వచ్చి పవన్ పై దాడి జరిగిన విషయం వాస్తవమేనని, అందుకు సంబంధించి అనిల్ రెడ్డిని ఇప్పటికే అరెస్టు చేశామని, మరికొంత మంది కోసం గాలిస్తున్నామని, బాధితుడు పవన్ కోసం నాలుగు గ్రూపులుగా పోలీసులు గాలింపులు చేపట్టారని వెల్లడించారు. బాకీ చెల్లించలేదని దళితులని చావబాదిన ఘటనను అధికార, ప్రతిపక్ష పార్టీలు తమకు అనుకూలంగా మలుచుకునేందుకు రకరకాల ఎత్తులు వేయటం గమనార్హం. ఎట్టకేలకు శుక్రవారం రాత్రి పోలీసులు బాధితుడు పవన్‌ను చిత్తూరు సమీపంలో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అసలు వాస్తవం ఏమి జరిగిందనే కోణంలో విచారణ ముమ్మరం చేశారు. ఏ చిన్న సంఘటన జరిగినా బూర్జవ రాజకీయ పార్టీలు వాటిని తమకు అనుకూలంగా ఏ విధంగా మల్చుకుంటాయో అనే దానికి ఈ ఘటన మరో నిదర్శనం. పోలీసులు విచారణలో వాస్తవాలు కనుగొని ఏ పార్టీకి అనుకూలంగా వ్యవహరించకుండా, నిష్పక్షపాతంగా వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఆ దిశగా పోలీసులు వ్యవహరిస్తారని ఆశిద్దాం.

ముక్కంటి సేవలో హైకోర్టు జడ్జి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర హైకోర్టు జడ్జి తుహిన్ కుమార్ శనివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

శివయ్య సేవలో రాష్ట్ర ఎస్ఎస్ఏ ప్రాజెక్టు డైరెక్టర్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టరు శ్రీనివాసరావు శనివారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. అంతకమునుపు ఆయన రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి



ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారిని స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి దర్శించుకున్నారు. చంద్రబాబు తిరిగి సీఎం కావడంతో కాలినడకన తిరుమలకు వచ్చి మొక్కులు చెల్లింపు చేసుకున్నానని మీడియాతో తెలిపారు. చెత్త రహిత రాష్ట్రంగా, స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర లక్ష్యంగా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. ఏపీ అన్నిరంగాల్లో అభివృద్ధి జరిగి, లబ్ధిదారులందరికీ సంక్షేమఫలాలు అందించే శక్తి సామర్థ్యాలు మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకు ప్రసాదించమని శ్రీవారిని ప్రార్థించానన్నారు.

వైభవంగా ద్రౌపది దేవి రథోత్సవం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరులో శ్రావణ మాస బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ ద్రౌపది దేవి సమేత శ్రీ ధర్మరాజుల తిరునాళ్ల మహా రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఉదయం ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకం నిర్వహించారు. పూలమాలలు, పట్టుచీరలు, రత్నాభరణాలతో అలంకరించిన ఉత్సవ రథం భక్తుల దృష్టిని ఆకర్షించింది. పాండవుల ధర్మ విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ రథోత్సవం మహాభారత కాలం నుండి వస్తున్న సంప్రదాయం అని ఆలయ కమిటీ సభ్యులు వివరించారు. మహారథం పునర్నిర్మాణదాత వసంత్ తరుణ్ కుమార్ కాగా, రథానికి వస్త్ర సమర్పణ బొల్లిని దివాకర్ నాయుడు అందించారు. రథోత్సవ ఉభయదారులు గోగినేని జనార్ధన్ నాయుడు, గోగినేని సుమలత కాగా, కార్యక్రమానికి సహాయ సహకారాలు పుత్తూరు మరియు పరిసర ప్రాంతా కమ్మ వారి అభ్యుదయ సంఘం అందించింది. మహారథం ముందర ఉభయదారులుగా భాస్కర్ రత్నం వక్కపొడి సేవలందించారు. ఘటోత్కచ వాహనం రామ్బోల్ డ్రమ్స్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనిని మోహన్ గ్రూప్స్ అందించగా, ఆనంగి రవి బాబు ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం రథం తిరిగి ఆలయానికి చేరగా మహా మంగళహారతి నిర్వహించారు.

పవన్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: దళిత బిడ్డ పవన్ పై అనిల్ కుమార్ రెడ్డి అనే రౌడీ షీటర్, అతని అనుచరులు విచక్షణారహితంగా దాడి చేయడంతో పాటు సోషల్ మీడియాలో వైరల్ చేయడం దారుణమని, అతన్ని, అతని అనుచరులను కఠినంగా శిక్షించాలని తిరుపతి జిల్లా ఎస్పీని, కూటమి ప్రభుత్వాన్ని తిరుపతి జిల్లా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ అండ్ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్ వాలముని కోరారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియాలో వైరల్ అయిన దాడిని ఖండించారు. గత ప్రభుత్వంలో దళిత గిరిజన బిడ్డలపై అనేక దాడులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలో భూమన కుటుంబం ఇంకా అధికారంలో ఉన్నట్లు ప్రవర్తిస్తున్నారని త్వరలో ఊచలు లెక్కబెడతారని హెచ్చరించారు. దళిత గిరిజన బిడ్డలపై దాడులు జరిగితే తాము ఊరుకునేది లేదని హెచ్చరించారు. పవన్‌ను పట్టుకొని మూడు గ్రూపులు విచక్షణారహితంగా దాడులకు తెగబడటం దారుణమన్నారు. పవన్ అతి కిరాతకంగా దాడి చేసిన అనిల్ కుమార్ రెడ్డి అతని అనుచరులపై కఠినమైన చర్యలను తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తిరుపతి జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగు నీటి సమస్య తలెత్తరాదు

ప్రజాశక్తి - దొరవారిసత్రం: గ్రామల్లో తాగునీటి సమస్య లేకుండా చేయాలని ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అధికారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన, సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలంలో కరెంటు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని తెలిపారు. పాఠశాలల విలీనం ఆపాలని మండల విద్యాధికారిని కోరారు. రైతులకు సకాలంలో విత్తనాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శైలజ మారి, ఎఒ, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం మృతికి నివాళి

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండల పరిధిలోని కొత్త వేప కుప్పం పంచాయతీ, వేపకుప్పం గ్రామానికి చెందిన తంజావూరు సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని స్థానిక టిడిపి నాయకులు తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, నరసింహారెడ్డి, కేశవులునాయుడులతో కలిసి మృతుని స్వగ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేసి, ఓదార్చారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.బిందు మాధవి, బి.విజయ కుమార్ రెడ్డి, బట్టే చాణిక్య, కె.సోమశేఖర్, జె.ప్రకాష్, కె.చిన్న స్వామిరెడ్డి, మాజీ సర్పంచ్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులా తడుకు రైల్వే అండర్ బ్రిడ్జి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడుకు పంచాయతీ పరిధిలోని రెండు రైల్వే అండర్ బ్రిడ్జీల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షంతో ఎగువగూరూరు, తడుకు వద్దనున్న రైల్వే అండర్ బ్రిడ్జిల్లో నీరు చేరడంతో ఎగువగూరూరు దళితవాడ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం ఎగువగూరూరుకు చెందిన ఎ.సుబ్రమణ్యం అనే వ్యక్తి గుండెపోటు రావడం ఆసుపత్రికి తరలించడానికి నానా తంటాలు పడ్డారు. అండర్ బ్రిడ్జిలో నీరు నిలిచి పోవడంతో 108 వాహనం గ్రామంలోకి రాక పోవడంతో, స్ట్రెచర్‌పై రోగిని గ్రామస్తులు అవతలి వైపునకు అతి కష్టంమీద తరలించారు. ఇలా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం పట్టించు కోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇకనైనా రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జిల్లో వర్షపు నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే దుస్థితి కొనసాగితే సమీప గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఉపాధి హామీ పనులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి): ఉపాధి హామీ కార్మికుల జీవనోపాధి పెంపొందించడమే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యమని సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పి కన్నా రెడ్డి పేర్కొన్నారు. శనివారం తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, శానంభట్ల ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం ఉపాధి కార్మికులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కార్మిక కుటుంబానికి 100 రోజుల పని కల్పించి, రోజుకి రూ. 307 రూపాయలు వేతనం పొందేలా పనులు చేయాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో చేసిన ఉపాధి హామీ పనులను గురించి తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎస్ఆర్‌పి సి ఆర్ ఆండ్ మూర్తి మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికుల హక్కులు కల్పించడంలో గ్రామసభలు కీలకమన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేసే పనులు భూగర్భ జలాల పెంపుకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పిలు జి.సుబ్రమణ్యం కె.సి సుబ్బారాయుడు, ఎస్.రవీంద్ర, ఏ శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ ధృవపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - రేణిగుంట: ఏకం యుఎస్ఎ వారి ఆర్థిక సహకారంతో సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రేణిగుంట మండలం, పద్మా నగర్‌లో 25 మంది మహిళలకు 3 నెలలు పాటు టైలరింగ్ శిక్షణ ఇవ్వడం జరిగింది. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాలు పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏకం యుఎస్ఏ వాలంటీర్ శ్రీలేఖ, విహారిదాస్, చిన్నారి విజయ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిర్డ్స్ సంస్థ కో ఆర్డినేటర్ తేజోవతి, హరిబాబు, శిక్షకురాలు మంజుల, మహిళలు పాల్గొన్నారు.

ఈ ఏడాదైనా ఆర్వోబి నిర్మాణం పూర్తయ్యేనా..?

- రూ. 87 కోట్లుతో ప్రాజెక్ట్ నిర్మాణం
- చివర దశలో ఆగిన రైల్వే పై ఓవర్ బ్రిడ్జ్
- ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు



ప్రజాశక్తి - ఏర్పేడు : వాణిజ్య వ్యవస్థ దినదినాభివృద్ధి చెందడంతో ఇటు రోడ్లు అటు రైల్వే లైన్ రద్దీగా మారిన పరిస్థితి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీలో పలు హైవేల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ కోవలోనే ఏర్పేడు- వెంకటగిరికి మధ్య ట్రాఫిక్ సమస్యను తగ్గించి రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి ఏర్పేడులో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి (ఆర్వోబి) ప్రాజెక్టు రెండు సంవత్సరాల క్రితమే ప్రారంభమైంది. రూ. 87 కోట్లు వ్యయంతో బ్రిడ్జిని కలుపుకొని రోడ్డు కనెక్టివిటీ ఏర్పేడు చెక్ పోస్ట్ నుండి ఐఐటి వరకు క్రిషి ఇన్ఫ్రాటెక్, బెంగళూరు సంస్థ నాలుగు వరుసల రోడ్లు(150 అడుగుల వెడల్పు), కిలోమీటర్ మేర నిర్మాణాలు చేపట్టింది. ఈ ప్రాజెక్టు 90 శాతం గత నాలుగు నెలల క్రితమే పూర్తి చేయగా, అప్పటినుండి పట్టాలపై రైల్వే విభాగం చేపట్టాల్సిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే మార్గం నిత్యం రద్దీగా మారడంతో ఏర్పేడు రైల్వే గేట్ వద్ద అధిక ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ప్రజలు ఈ ఆర్‌వోబి ప్రాజెక్టు పూర్తయితే సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నారు.

బ్రిడ్జ్ పూర్తయితే ప్రయాణం సులభతరం..

తమిళనాడు, కర్ణాటకల నుండి ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో ఏర్పేడు మీదుగా వెంకటగిరి, రాపూరు, గూడూరు ప్రాంతాలకు నిత్యం వాణిజ్య రవాణా పెరుగుతోంది. విద్యాసంస్థలైన ఐఐటి, ఐజర్ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వివిధ కర్మాగారాలకు ఈ మార్గం నుండే నిత్యం రవాణాలు జరుగుతుండడం విశేషం. మరీ ఈ ఆర్వోబి ప్రాజెక్టు పూర్తయితే ఏర్పేడులో స్తంభించే ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టి వాణిజ్య వ్యవస్థ భవిష్యత్తులో మరింత పుంజుకునే అవకాశం ఎంతైనా ఉంది.

గేటు పడితే వేచి చూడాల్సిందే..

నడికుడి– శ్రీకాళహస్తి రైల్వే మార్గాన నిత్యం రద్దీగా రైళ్ల రాకపోకలు జరుగుతుండడంతో ఏర్పేడు రైల్వే గేటు వద్ద పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. గేటు పడిన ప్రతిసారి 10 నుండి 30 నిముషాలపాటు వేచి చూడాల్సిన పరిస్థితి. అత్యవసర చికిత్సకు వెళ్లే అంబులెన్సులు కూడా ఇబ్బంది పడిన సందర్భాలున్నాయి. ఐఐటి, ఐజర్ కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, అధ్యాపక బృందానికి, మండల కేంద్రానికి వెళ్లే అధికారులకు, సామాన్యుడికి కూడా సవాల్‌గా ట్రాఫికి సమస్య మారుతున్న పరిస్థితి నెలకొంది.

ఘనంగా ప్రపంచ ఆదివాసుల దినోత్సవం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ప్రపంచ ఆదివాసుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ వైఎస్ఆర్‌పి కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ఎస్టీ విభాగం అధ్యక్షులు గట్టుపల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం ఆదివాసుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. కుంభ రవిబాబు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజన పోరాటలద్వారా హక్కులు రక్షింపడుతాయని, తద్వారా గిరిజనులు ఆర్థిక, సామాజిక అభివృద్ధి జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో గిరిజనుల సంక్షేమానికి పెద్ద పీట వేశారని, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో వెనుకబడిందని ఆరోపించారు. ఇప్పటికైనా గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి గొట్టేటి మాదవి, ఉమ్మడి విశాఖజిల్లా జడ్పీ చైర్మన్ సుభద్ర, అరకు శాసనసభ్యులు మచ్చులింగం, మాజీ ట్రైకార్ చైర్మన్ సురేంద్ర, ఎస్టీ కార్యదర్శి చిరంజీవి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ మిని గురుకుల పాఠశాలలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రధానోపాధ్యాయురాలు మేరీ ప్రియత, సిబ్బంది నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ అంజలి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి సీఎం కృషి చేయాలి

ప్రజాశక్తి - రేణిగుంట: గిరిజనుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని గిరిజనులు ఉద్యమిస్తే గుణపాఠం తప్పదని ఏపీ గిరిజన సంఘం రేణిగుంట మండల కార్యదర్శి కే ఈశ్వరమ్మ హెచ్చరించారు. రేణిగుంట మండలంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసి గిరిజన దినోత్సవాన్ని పురస్కరించుకొని గిరిజన సంఘం మండల కమిటీ సమావేశం శనివారం రొడ్డా మునస్వామి అధ్యక్షతన రేణిగుంట జి.యం వీధి లోని పుచ్చలపల్లి సుందరయ్య కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో గిరిజనుల స్థితిగతులు, ఆర్థిక, రాజకీయ, సామాజికంగా వెనుకబాటుతనంపై చర్చించారు. ఈ సమావేశంలో మూడు తీర్మానాలను ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ ఆదివాసి గిరిజన దినోత్సవం సందర్భంగా బీసీబిఏ కులానికి చెందిన బోయలను, ఇతర కులాలను గిరిజన తెగ (ఎస్టి) జాబితాలోకి చేర్చాలని ఆమోదించిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలి. ప్రస్తుతం ఉన్న ఎస్టీ జాబితాలోకి గిరిజనేతరులను చేర్చకుండా చట్టం చేస్తామని గిరిజనులకు 'భరోసా' కల్పించాలి. గిరిజనులు ఆర్థికంగా ఎదిగి తన కాళ్లపై నిలబడ్డానికి ప్రతి కుటుంబానికి ఒక లక్ష నుండి రెండు లక్షలు రూపాయలు ఎస్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఎటువంటి బ్యాంకు షరతులు లేకుండా ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పించాలి. గిరిజన తెగలో కొత్తగా పెళ్లయిన జంటలకు 'రేషన్ కార్డులు' మంజూరు చేయాలి. ఇంటి స్థలం లేని నిరుపేదలకు 'ఇంటి పట్టాలు' ఇచ్చి, ప్రభుత్వమే హౌసింగ్ ఇల్లు నిర్మించి' ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం మండల కమిటీ తీర్మానించడం జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం మండల కార్యదర్శి కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, చిట్టేటి ప్రసాద్, రొడ్డా మునిస్వామి, గోళ్ళ వెంకటరమణ, కె. రాముడు, రత్నమ్మ పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీ అభివృద్ధి కోసం వినతి పత్రం


ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణని పుత్తూరు ముస్లిం మైనారిటీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు షేక్ సందాని, ఎస్.కే. షబ్బర్, నగరి నియోజకవర్గ మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఎదుల్లా హుస్సేన్, నగరి నియోజకవర్గ తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హమీద్ బాషా పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి



ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యా రంగం సమస్యలు నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షణకు, కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీపై ప్రజాస్వామ్యయుతంగా ఆందోళనలు చేస్తున్న విద్యార్థి సంఘాలను విద్యాలయాలలో అడ్డుకున్నే ప్రభుత్వ ఉత్తర్వులు దుర్మార్గమని, తక్షణమే వెనక్కి తీసుకొవాలని తిరుపతి జిల్లా లోని అన్ని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం వేమన విజ్ఞాన కేంద్రంలో అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉత్తర్వులు రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ అక్బర్, ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి, పిడిఎస్ ఓ స్రవంతి, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి లోకేష్, ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, రంజిత్, ఎన్ఎల్ఎస్ఏ అధ్యక్షులు సుందర్, నేతలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వ చర్యలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ ఎస్ ఎఫ్ నగర కార్యదర్శి విష్ణు, వినయ్, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు శివ, బాలాజీ, కుమార్, యూనివర్సిటీ రాష్ట్ర కో కన్వీనర్ అశోక్ కుమార్, ఎన్ ఎల్ ఎస్ ఏ ప్రకాష్ లు పాల్గొన్నారు.

మరమ్మతుకు గురైన చేతి బోరు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ, గేట్ పుత్తూరు 9 వార్డ్, పాత వీవర్స్ కాలనీలో చేతి బోరు మరమ్మతుకు గురయ్యింది. మున్సిపల్ సిబ్బంది వీధి కుళాయి నీరు ఉదయం 4 గంటలకు వదులుతుండటంతో, ఆ సమయంలో నీరు పట్టుకోవడం ఇబ్బందిగా ఉందని స్థానికులు తెలిపారు. చేతి బోరు మరమ్మతు చేయించాలని కోరారు. కనీసం మున్సిపాలిటీ నీరు వదిలే సమయమన్నా మార్చాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కాలనీలో ఎక్కువగా శాతం మర మగ్గం కార్మికులు నివసిస్తున్నారు. పగలంతా మగ్గం పనితో అలసిపోయి, మరలా పొద్దున్నే లేచి నీరు పట్టుకోవడం కష్టంగా ఉందని విన్నవించారు.

> చేతి బోరు మరమ్మతుకు గురయి చాలా రోజులయింది. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. చేతి బోరు మరమ్మత్తు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలి. **- రామస్వామి, గేట్ పుత్తూరు**
>
> ఇప్పటివరకు బోరు చెడిపోయిన విషయం మా దృష్టికి రాలేదు. త్వరగా మరమ్మత్తు చేసి నీటి సౌకర్యాన్ని పునరుద్ధరిస్తాం. **- మంజునాథ్ గౌడ, మున్సిపల్ కమిషనర్**

అయోమయంలో డిగ్రీ ప్రవేశాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ రోజు రోజుకి ఆలస్యమవుతోంది. గత ప్రభుత్వం తీసుకున్న రాష్ట్రవ్యాప్త ఆన్లైన్ డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ బెడిసి కొట్టింది. అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలో డిగ్రీకి అడ్మిషన్లు ప్రక్రియ పెట్టడం ద్వారా ఎంతో మంది గ్రామీణ నిరుపేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు డిగ్రీ విద్యకు దూరమయ్యారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం కూడా ఉన్నత విద్య, డిగ్రీ విద్య, పిజి విద్య, సాంకేతిక విద్య గురించి పట్టించుకోకపోవడం దారుణమని పలు విద్యార్థి సంఘాలు, వామపక్ష విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు మే నెలలో ఫలితాలు విడుదల చేసి, డిగ్రీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించకపోవడం దారుణమని విమర్శిస్తున్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 పాలసీను తీసుకురావడం ద్వారా సింగల్ మేజర్ సబ్జెక్టును ఒకే ఒక ఆప్షనల్ సబ్జెక్టుగా డిగ్రీని పూర్తి చేయడం ద్వారా అవకాశాలు తక్కువగా ఉంటాయని భయంతో పట్టణ ప్రాంతాలు చెందిన విద్యార్థులు ఎక్కువమంది బిటెక్, ఇంజనీరింగ్ వైపు మొగ్గు చూపుతున్నారు. బీటెక్, ఇంజనీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ కూడా ఆలస్యం అవుతుందని నెపంతో మధ్యతరగతి, ఉన్నత స్థాయి ఉద్యోగులకు చెందిన పిల్లలను అప్పో, సప్పో చేసి తమ పిల్లల్ని పక్క రాష్ట్రాల్లో చేర్పిస్తున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి, ఉన్నత విద్యాశాఖ అధికారులు సత్వరమే నిర్ణయం తీసుకొని ఇంజనీరింగ్ అడ్మిషన్‌తో పాటు డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాలని డిమాడ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాల నేతలతో ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

మోడీ కనుసన్నల్లో రాజ్యాంగ సంస్థలు




ప్రజాశక్తి - తిరుపతి సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్దంగా వ్యవహరించాల్సింది పోయి, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ పాలన సాగిస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. తిరుపతి నగరంలో సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కేవలం చంద్రబాబు నాయుడు, నితీష్ వల్ల మనుగడ సాగిస్తోందన్నారు. సంచాలనాత్మకంగా ప్రచారంలో ఉన్న దొంగ ఓట్ల జాబితా ఎన్నికల కమీషన్ నిర్లక్ష్యపు పనితీరుకు అద్దం పడుతోందన్నారు. గతం లో ఓట్ల చేర్పులు, తొలగింపులపై తిరుపతిలో జరిగిన ఎన్నికల సందర్భంగా ఆధారాలతో నిరూపించామని గుర్తు చేశారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో నిరూపించారన్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చితే దేశ వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అమరావతి నిర్మాణం పేరుతో రైతులనుంచి మరోసారి భూములు సేకరించి వ్యాపారులకు అప్పగిస్తున్నారన్నారు. శ్రీకాకుళంలో ఈనెల 12న ఆందోళన, ప్రత్యక్ష పోరాటం చేస్తామని ప్రకటించారు. వివేకానంద రెడ్డి హత్యకేసులో మాజీ సీఎం జగన్‌కు మోడీ, అమిత్ షాలే రక్షణ కల్పిస్తున్నారని ఆరోపించారు. తిరుపతిలో దళిత యువకుడిపై వైకాపా నాయకులు దాడి చేయడం దుర్మార్గపు చర్యన్నారు. దాడి చేసిన వారు భూమన కరుణాకర్ రెడ్డి, అతని తనయుడు అభినయ రెడ్డి అనుచరులని ప్రచారం సాగుతున్న నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి ఖండించకపోవడం వెనక అంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుల హరినాథ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, నగర కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎస్వీయూ క్యాంపస్‌లో నెట్వర్క్ సమస్య

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో దేశంలోని ప్రఖ్యాత టెలికాం కంపెనీలైన బిఎస్ఎన్ఎల్, జియో నెట్వర్క్, ఎయిర్టెల్ నెట్వర్క్ వంటి సంస్థలకు సంబంధించిన టవర్లు ఉన్న నెట్వర్క్ ప్రాబ్లం సమస్య వస్తుందని, కనీసం చరవాణి కాల్స్ మాట్లాడేందుకు కూడా సిగ్నల్ సరిగా రావడం లేదని విద్యార్థులు, పరిశోధకులు, ఆచార్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ఎమర్జెన్సీ కాల్స్ మాట్లాడాలంటే కూడా ఇబ్బందిగా ఉందన్నారు. వర్సిటీ ప్రత్యేకమైన స్థలం కేటాయించి ఆయా కంపెనీలతో సహకార ఒప్పందాలు చేసుకుని జియో కంపెనీకి కొన్ని ప్రత్యేక హక్కులను ఇస్తే సద్వినియోగం చేసుకోకుండా నెట్వర్క్ ప్రాబ్లంతో ఆటంకాలు కలిగిస్తుందని రాష్ట్ర యూనివర్సిటీల కో కన్వీనర్ అశోక్ కుమార్ గౌడ్ విమర్శించారు. నెట్వర్క్ సరిగా పనిచేయని పక్షంలో వర్సిటీ ఉన్నతాధికారులు ఆ కంపెనీలతో చేసుకున్న సహకార ఒప్పందాన్ని రద్దుచేసి వెంటనే క్యాంపస్‌లో ఉన్న టవర్లను తీసివేయాలని డిమాండ్ చేశారు. పరిశోధకులకు ఇంటర్నెట్ సౌకర్యాలు, ప్రత్యేకమైన ల్యాబ్ వసతులు అందించాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.

ఏపీజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మద్దినేని హరిబాబు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీజెఎఫ్) రాష్ట్ర కమిటీ ఎన్నికలు ఆగస్టు 9న విజయవాడ గాంధీ రోడ్‌లోని ఎన్జీవో భవన్‌లో శనివారం జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర గౌరవ ప్రధాన కార్యదర్శి, మహా టీవీ సిఎండి వంశీకృష్ణ ఆధ్వర్యంలో, కృష్ణ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏకగ్రీవంగా కొత్త రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆంధ్రనాడు తెలుగు దినపత్రిక ఎడిటర్ మద్దినేని హరిబాబును, రాష్ట్ర అధ్యక్షుడిగా రాజేష్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన హరిబాబుకు వివిధ జిల్లాల నుంచి హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. ఎన్నికల అనంతరం మీడియాతో మాట్లాడిన హరిబాబు, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల రక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం ఏపీజెఎఫ్ వేదికగా కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు శిక్షణా శిబిరాలు, సదస్సులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

క్రైం న్యూస్

సెల్ ఫోన్ చోరీ చేసిన బాలుడు



సిసి కెమెరాలో రికార్డయిన బాలుడి సంచారం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: నగరంలోని ఓ మొబైల్ షాప్‌లో మైనర్ బాలుడు సెల్ ఫోన్ చోరీ చేసినా ఘటన వెలుగులోకి వచ్చింది. మొబైల్ షాప్ నిర్వాహకులు కథనం మేరకు తిరపతి నిమ్మకాయల వీధిలో ఎస్ కె ఎంటర్ప్రైజెస్ షాప్‌లో మెమోరికార్డ్ కావాలని షాప్‌కు ఓ మైనర్ బాలుడు వెళ్ళాడు. ఎవ్వరు గమనించని సమయంలో చాకచక్యంగా మొబైల్ ఫోన్ దొంగలించాడు. సెల్ ఫోన్ దొంగలించిన వెంటనే అక్కడి నుండి పారి పోయాడు. డిస్ప్లే పైన ఉన్న సెల్ ఫోన్ కనిపించక పోవడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. బాలుడు చోరీ చేసిన పారిపోయింది సీసీ కెమెరాల్లో రికార్డయింది. షాపు యజమానులు పోలీసులకు ఫిర్యా చేశారు.

పాపానాయుడు పేటలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి-ఏర్పేడు: పాపానాయుడుపేటలో జరుగుతున్న ధర్మరాజులు తిరునాళ్ళ సందర్భంగా ఏర్పేడు సిఐ బి.శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ పెట్రోలింగ్లో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, ట్రైన్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి -కోట : ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు కోట మండలం, గూడలికి చెందిన పెంచలయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద మంజూరు చేసిన 45 వేల రూపాయల చెక్కును శనివారం బాధితుల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, వెంకన్నపాలెం పంచాయతీ సర్పంచ్ కోకర్ల మధు యాదవ్, అక్బర్ బాషా, పల్లెమల్లు వెంకట కృష్ణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

మూఢనమ్మకాలు వీడండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో మాజీ ప్రో టెం స్పీకర్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా శనివారం గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ప్రజలలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జే.వి.వి. జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు చెంగయ్య, రెడ్డప్ప, వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమ రావు, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిరాంను కలిసిన తిరుమల టిడిపి నేతలు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ దంపతులకు దేవతామూర్తుల చిత్రపటాలను తిరుమల స్థానిక టిడిపి నాయకులతో కలిసి అందజేసిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఆర్ సి మునికృష్ణ , తిరుమల టిడిపి పట్టణ అధ్యక్షుడు రాజు యాదవ్ , పాటకం వెంకటేష్ , కరాటి చంద్ర , శివ షణ్ముగం మరియు కాయిన్స్ కలెక్షన్ హాబిటెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీకాళహస్తిలో గ్రీవెన్స్ సెల్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక పంచాయతీ రాజ్ అతిథిగృహంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ కు హాజరవుతారని చెప్పారు. నియోజవర్గ పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్వరలో చెన్నాయిగుంట-వెంకటాపురం కాలువ పనులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని చెన్నాయిగుంట – వెంకటాపురం వైపు వెళ్లే కలుజు కాలువకు జంగిల్ క్లియరెన్స్ చేస్తూ మీరు సాఫీగా వెళ్లడానికి పనులు జరుగుతాయని ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కవితా రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఈ కాలువ పనులు చేయడానికి టెండర్లను ఆహ్వానించడం పూర్తి అయ్యిందన్నారు. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో త్వరలోనే పనులు ప్రారంభమై పూర్తి చేయడానికి సన్నహాలు చేస్తున్నామన్నారు.

సుబ్బయ్యకు ఘన సత్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టిడిపి సీనియర్ నేత, ఏపీ గిరిజన సలహా మండలి సభ్యులు సుబ్బయ్యను నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి శనివారం ఘనంగా సత్కరించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సుబ్బయ్య గిరిజన భవన్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజన సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న సుబ్బయ్యను ఈ సందర్భంగా నెల్లూరు మేయర్ అభినందించి, సత్కరించారు.

ఘనంగా మహేష్ బాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నాయుడుపేట: సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు వేడుకలను అభిమానులు శనివారం నాయుడుపేటలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. మేరీ వృద్ధాశ్రమంలో వృద్ధుల వద్ద జర్నలిస్ట్ ఎన్.శ్రీనివాస్ జెమిని ఆధ్వర్యంలో కేకు కటింగ్ చేశారు. అనంతరం సుమారు 30మంది వృద్ధులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ బాబు ఫ్యాన్స్ సభ్యులు తడుకు చందు, పునబాక శ్రావణ్ కుమార్, కప్పల రాజా, పునబాక కళ్యాణ్, పారిచర్ల చరణ్, లేబూరు మజ్ను తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరులో శ్రీ ద్రౌపదిదేవి తిరునాళ్ల సందర్భంగా శనివారం భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు. కొంతమంది జిల్లా స్పెషల్ టాస్కోర్స్ కానిస్టేబుల్స్ విచక్షణా రహితంగా ప్రవర్తించారు. రామ్మోహన్, అశోక్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్స్ రథాన్ని లాగడానికి వెళ్లిన కొంతమంది యువకులను లాగి కొట్టారు. దీన్ని వీడియో తీస్తున్న టీవీ5, మహా న్యూస్ మీడియా రిపోర్టర్ల పై ఎందుకు తీస్తున్నావంటూ నానాబూతులు మాట్లాడి, వీడియో రికార్డు చేస్తున్న కెమారాను లాక్కోవడానికి ప్రయత్నించారు. అయితే మీడియా రిపోర్టర్ మీడియా అంటున్న, నువ్వు ఎవడివైతే నాకేంటి అంటూ దురుసుగా ప్రవర్తించి, లాగి కొట్టారు. దీంతో మీడియా మీద దురుసుగా ప్రవర్తించడం తగదని, లోకల్ డిఎస్పీకి, సీఐకి పోన్ చేసి ఇస్తామని, మాట్లాడమని విన్నవించుకుంటున్నా, పట్టించుకోకుండా దాడి చేశాడు. దీంతో మీడియా రిపోర్టర్ చేసేదేమి లేక వెనుతిరిగాడు. తిరునాళ్ల సందర్భంగా ఇలా పోలీసుల ఓవర్యాక్షన్ పై విమర్శలు వస్తున్నాయి.